నీరు నిండుగా.. మది మురిసెగా..!


అంబారావుగూడ సమీపంలో ప్రవహిస్తున్న వాగు


కళకళలాడుతున్న అమ్మన్నమడుగు ప్రాజెక్టు

ఇటీవల మండలంలో కురిసిన వానలతో నదులు, చెరువులు, వాగులు, వంకలు నిండుకుండలా మారాయి. మండలంలోని తుమ్మగూడ, ధనోరా, గోయగాం, అంబారావు, మెట్టపిప్రి, సాంగ్వి గ్రామాలకు సమీపంలో ఉన్న వాగులు, నదులు ప్రస్తుతం నీటితో నిండిపోయాయి. కెస్లాగూడ గ్రామసమీపంలో ఉన్న అమ్మన్న మడుగు ప్రాజెక్టులో నీరు భారీగా చేరింది. దీంతో జిల్లాలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - కెరమెరి


గోయగాం వాగులో భారీగా చేరిన వర్షపు నీరు

క్లుప్తంగా

గుంత పూడ్చివేత


గుంత పూడ్చివేస్తున్న మధుకర్

దహెగాం: మండలంలోని కల్వాడ నుంచి కుంచవెల్లి వెళ్లే మార్గంలో రోడ్డుపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోక పోవడంతో కల్వాడ గ్రామానికి చెందిన హట్కర్ మధుకర్ గురువారం గుంతను పూడ్చేశారు. జేసీబీ సహాయంతో గుంతలో మట్టి పోశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

108, 102 వాహనాల తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రాం మేనేజర్

వాంకిడి: మండలంలోని 108, 102 వాహనాలను ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ గురువారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. వాహనాల్లో అన్ని సదుపాయాలు ఉండాలని, మెడికల్ టెక్నీషియన్, ట్రీట్‌మెంట్ ఎలా చేస్తున్నారనే విషయంపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట 108 పైలెట్ ఆత్రం భీంరావు, ఈఎంటీ అమ్జద్, 102 కేప్టెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

దహెగాం: సమగ్రశిక్ష ఉద్యోగుల మండల నూతన కమిటీని గురువారం మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మధుశ్రీ, ఉపాధ్యక్షులుగా త్రివేణి, గౌరవ అధ్యక్షులుగా రిజ్వానా, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, సహాయ కార్యదర్శిగా రాజేశ్, కోశాధికారులుగా శేఖర్, రాధిక, అధికార ప్రతినిధిగా లక్ష్మణ్, మీడియా ప్రతినిధులుగా అశోక్, లలిత, అడ్వైజర్‌లుగా స్వప్న, సంతోష్, లక్ష్మి, శేఖర్‌లను ఎన్నుకున్నారు.

కథల పుస్తకాలతో పఠనాసక్తి

తిర్యాణి: కథల పుస్తకాలతో విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందుతుందని విద్యాశాఖ మండల నోడల్ అధికారి అంజయ్య అన్నారు. గురువారం మండలంలోని దుగ్గపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో రీడింగ్ క్యాంపెన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో రూం టూ రీడ్ సంస్థ బ్లాక్ కో -ఆర్డినేటర్ శ్రీనివాస్ చారి, ఉపాధ్యాయుడు రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల హాజరు వందశాతం ఉండాలి


సలహాలు అందజేస్తున్న ఎంఎన్‌వో ప్రకాశ్

కెరమెరి: విద్యార్థుల హాజరు వందశాతం ఉండాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. గురువారం ధనోరా ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరును పరిశీలించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా హాజరయ్యారు. విద్యార్థుల నమోదు పెంచాలని, ప్రతీ వారంలో మూడుసార్లు గుడ్లు తప్పనిసరిగా భోజనంలో వడ్డించాలన్నారు.

పంట ధ్వంసం చేసిన వారిపై ఫిర్యాదు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రుల్‌నగర్ విలేజ్ నెం.4 శివారులోని సర్వే నంబర్ 17/190లో సాగు చేస్తున్న కంది పంటతో పాటు కంచెను పలువురు ధ్వంసం చేశారని ఆరోపిస్తూ విలేజ్ నెం.3 గ్రామానికి చెందిన రంజిత మహంత గురువారం ఈజ్‌గాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విలేజ్ నెం.4 గ్రామానికి చెందిన తనపద మండల్, సిద్ధార్థ మండల్, అర్జున్, కమల్ మండల్‌లు తమ పంటను ధ్వంసం చేశారని, వెంటనే విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావాలి

నార్నూర్: పంచాయతీ అభివృద్ధి పనుల్లో పెసా మొబలైజర్‌లు భాగస్వామ్యం కావాలని పెసా మొబలైజర్ జిల్లా కోఆర్డినేటర్ అర్క వసంత్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

గం‘జాయ్’..!



- జిల్లాలో పెరుగుతున్న మత్తు వినియోగం
- స్కూళ్లు, కాలేజీలకూ విస్తరించిన వైనం
- సోషల్ మీడియా ద్వారా విక్రయాలు
- చిత్తవుతున్న యువత, విద్యార్థులు


గంజాయి స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు (ఫైల్)

కౌటాల: జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. గత కొన్నేళ్లుగా జిల్లాలో గంజాయి వాడకం విచ్చలవిడిగా పెరిగింది. ఒకప్పుడు ముఖ్యమైన నగరాలు, పట్టణాలకే పరిమితమైన గంజాయి ఇప్పుడు మారుమూల పల్లెలకూ విస్తరించింది. గంజాయి హుక్కాకు అలవాటు పడ్డ యువత వాటి మత్తులో చిత్తవుతున్నారు. మత్తులో గొడవలకు దిగుతూ, ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆదిలోనే దీనికి అడ్డుకట్ట వేయకపోతే ఎంతో మంది జీవితాలు నాశనమవుతాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

సులువుగా లభ్యం..

జిల్లాలో గంజాయికి అలవాటు పడ్డ వారిలో చాలా మంది నేరుగా వాడుతుండగా.. కొందరు మాత్రం దీని అనుబంధ ఉత్పత్తులు వాడుతున్నారు. గంజాయి విక్రయదారులు.. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా యాప్‌ల ద్వారా గంజాయి విక్రయాలు జరుపుతుండడంతో సులభంగా వినియోగదారులకు దొరుకుతోంది. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని పోలీసులు అధికారులు హెచ్చరిస్తున్నా అడ్డుకట్ట పడడం లేదు. గంజాయి వాడుతున్న వారిలో విద్యార్థులు, యువకులే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 26 గంజాయి కేసులు నమోదు కాగా, 43 మందిపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.3,15,500 విలువైన 12.620 కేజీల గంజాయి, 14 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

జిల్లాలో సాగు..

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో అంతర పంటగా గంజాయి గుట్టుగా సాగవుతోంది. కొందరైతే పెరటి తోటల్లో గంజాయి మొక్కలు పెంచుతున్నారు. కొంత మంది యువత పూల కుండీల్లో గంజాయి మొక్కలు పెంచుతున్నారు. అక్రమార్కులు కొంతమంది అమాయక రైతులకు డబ్బు ఆశ చూపి ప్రోత్సహిస్తున్నారు. దీనిని అరికట్టేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టినప్పటికీ గుట్టు చప్పుడు కాకుండా అక్రమ దందా కొనసాగుతోంది. పత్తి, ఇతర పంటల్లో ఏటా గంజాయి మొక్కలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. జిల్లాలోని సరిహద్దు మండలాల్లోని మారుమూల గ్రామాల్లో సాగైన గంజాయిని ఎండబెట్టిన అనంతరం కొంత మంది ప్యాకెట్ల రూపంలో తరలించి విక్రయిస్తున్నారు. జిల్లాలోని కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, జైనూర్, కెరమెరి, వాంకిడి, తిర్యాణి మండలాల్లోని పలు గ్రామాల్లో ఏటా అక్రమంగా సాగవుతోంది. ఇలా సాగైన గంజాయిని పొరుగున ఉన్న మహారాష్ట్రతో పాటు జిల్లాలోని గ్రామీణ యువతకు విక్రయిస్తూ రూ.లక్షల్లో గడిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం గంజాయి నియంత్రణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఆరోగ్యానికి ప్రమాదం



ప్రస్తుత డిజిటల్ కాలంలో గంజాయి యువతకు సులువుగా దొరుకుతుంది. గంజాయి చెడు అలవాటుగా మొదలై బానిసగా మార్చేస్తుంది. గంజాయి తాగాలని కొందరు హింసాత్మకంగా విచక్షణ కోల్పోయి ప్రవరిస్తుంటారు. గంజాయికి బానిసైన వారిని కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే మానసిక నిపుణులకు చూపించాలి.

– డాక్టర్ సుమిత్, నజరేత్ హాస్పిటల్, కౌటాల

గంజాయిపై ఉక్కుపాదం



జిల్లా సరిహద్దులో మహారాష్ట్ర ఉండడంతో గంజాయి అక్రమ రవాణా సాగుతోంది. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గంజాయి సరఫరా చేస్తున్న పలువురిని పట్టుకొని అరెస్టు చేశాం. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి. గంజాయితో కలిగే అనర్థాలను విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా గంజాయి విక్రయించినా, తాగినా తమకు సమాచారం అందించాలి. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలి.

– డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి


కెరమెరి: డీటీ సంతోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


జైనూర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు


లింగాపూర్: ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

లింగాపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 100 రోజుల్లో హామీలన్ని అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఇప్పటి వరకు సగం మందికి కూడా రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. మాజీ ఎంపీపీ సవితాప్రేమ్, వైస్ ఎంపీపీ ఆత్మారాం, సలీమ్, రాహుల్, దస్రు, గణపతి, అంబాజీ, తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: ఎలాంటి షరతులు విధించకుండా రుణాలు ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్‌లు అన్నారు. సంపూర్ణ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గురువారం నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెడ్మ కమల, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, నాయకులు ముత్యం రాజయ్య, ముక్కెర సరిత, గాయంగి మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కెరమెరి: రూ.2 లక్షల వరకు రుణం ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి రూ.2 లక్షల వరకు రుణం ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నా అనేక మందికి రుణమాఫీ వర్తించలేదన్నారు.

జైనూర్: రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కుమురంభీం కూడలి వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, మాజీ ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, మాజీ సర్పంచుల మండల అధ్యక్షుడు మడావి భీంరావు, నాయకులు కేశవ్, లక్ష్మి నరహరి, సాయజీ రావు, అంబాజీ, సతీశ్, నారాయణ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

కౌటాల: బాలబాలికల చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని భరోసా టీం ఎస్సై తిరుమల అన్నారు. గురువారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో భరోసా కేంద్రం, షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, బాలల సంరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియా వినియోగంలో యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసమే భరోసా కేంద్రాలు, షీటీంలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. బాల్యవివాహాలు, బాలికలను హింసిస్తే షీటీం, భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణ్ సింగ్, షీ టీం సభ్యులు రమాదేవి, సునీత, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలు సంరక్షించాలి


మొక్క నాటి నీరు పోస్తున్న వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' అనే నినాదంతో ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతీ శాఖ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తారావు, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, సహాయ ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత ఆరోగ్య శిబిరం


విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ పేపర్ మిల్లు, స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని భట్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భానుప్రకాశ్, సీఎస్‌ఆర్ రెనా బివాలు, ఎస్పీఎం ప్రతినిధి తుమ్మ రమేశ్, శ్రీవాణి, రేఖల ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, పుష్పలత, మాజీ ఎంపీటీసీ పోచన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రెబ్బెన: మండలంలోని సింగల్‌గూడకు చెందిన లావుడ్య శాంతాబాయికి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 44వేల చెక్కును గురువారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె భర్త కిషన్ నాయక్‌కు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్ మాట్లాడుతూ శాంతాబాయి గతంలో అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందగా విషయాన్ని ఎమ్మెల్సీ దండె విఠల్ కృషితో ప్రభుత్వం ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 44వేలు మంజూరు చేసిందన్నారు. అయితే బాధితురాలు ఇటీవల ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందగా, ఆమె మరణానంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును భర్తకు అందజేశామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, నాయకులు సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, ఇమ్రోజ్ అలీ, దుర్గం అన్నాజీలు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న శ్రీరామ భూమన్న

బెజ్జూర్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని బయోస్టాండ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ మేనేజర్ శ్రీరామ భూమన్న అన్నారు. మండల కేంద్రంలో బయోస్టాండ్ ఇండియా లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శనే ధ్యేయంగా వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి మెరిట్ విద్యార్థులకు రూ.2500 చొప్పున స్కాలర్‌షిప్ పది మంది విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రవికుమార్, సాయి సందీప్, ఫర్టిలైజర్ యజమాని సంతోష్, సందీప్, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘రైతులకు న్యాయం చేయాలి’


కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న పల్లె ప్రకాశ్‌రావు

రెబ్బెన: రెబ్బెన పీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్న రైతులకు నిర్ణీత సమయంలో సమస్య పరిష్కరించి రుణమాఫీ అందేలా న్యాయం చేయాలని మాజీ జెడ్పీటీసీ పల్లె ప్రకాశ్‌రావు కోరారు. గురువారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డీసీవోలను కలిసి వినతిపత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ రెబ్బెన పీఏసీఎస్‌లో అవినీతి అక్రమాలు జరిగినట్లు రైతులు ఆందోళనలు సైతం చేపట్టారని, సమగ్ర విచారణ జరగకుండా సమస్య పక్కదారి పడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పథకంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోందని, ఈ సమయంలో సస్పెండ్ అయిన సీఈవో సంతోష్‌ను డీసీవో, డీసీసీబీ మేనేజర్‌లను కోఆర్డినేట్ చేస్తూ రైతుల ఖాతాలను సవరించి తప్పులను సరిదిద్ది బ్యాలెన్స్ షీట్స్ ఇచ్చేలా కృషి చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కొవ్వూరి శ్రీనివాస్, పెసరు మదునయ్య, మాజీ సర్పంచ్ మంజుం రవీందర్, నాయకులు వెంకటేశం, రవీందర్, గోపాల్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

‘ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ టెండర్లు రద్దు చేయాలి’

ఆసిఫాబాద్: ఇటీవల జిల్లాలో నిర్వహించిన ఔట్ సోర్సింగ్ టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదని కాగజ్‌నగర్ మండలం చింతగూడకు చెందిన జాడి దీపక్ గురువారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు ఫిర్యాదు చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తిగా రహస్యంగా జరుగుతుందని, ఔట్‌సోర్సింగ్ ప్రక్రియలో అనేక నిబంధనలు చేర్చి, పాత ఏజెన్సీలకే అవకాశం కల్పించే విధంగా పాత ఏజెన్సీలతో అధికారులు కుమ్మక్కవుతున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి టెండర్ విధానాన్ని రద్దు చేసి, పాత, కొత్త ఏజెన్సీలకు అవకాశం కల్పించాలని కోరారు.

ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలి

జైనథ్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వేను తప్పనిసరిగా నిర్వహించాలని డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ వైసీ శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని డొల్లార గ్రామంలో గిమ్మ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. సిబ్బందితో కలిసి గ్రామంలో తిరుగుతూ.. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మురికి నీళ్లు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్, దోమల మందు పిచికారీ చేయించారు. సీహెచ్‌వో ఈశ్వర్, హెచ్‌ఈవో రామిరెడ్డి, సూపర్‌వైజర్ అనిత, ఏఎన్‌ఎం సునంద, పాల్గొన్నారు.

‘ఏమాయికుంటను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలి’

ఇంద్రవెల్లి: ఏమాయికుంట గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. గురువారం ఉదయం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో మార్నింగ్‌వాక్ నిర్వహించారు. జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2024 అవార్డుకు ఏమాయికుంట గ్రామపంచాయతీ ఎంపికైనందున గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. ఎంపీడీవో భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, గ్రామస్తులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


సాయం అందజేస్తున్న నాయకులు

కౌటాల: మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన సంగీత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి గురువారం మాలీ సంక్షేమ సంఘం నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు నిత్యావసర సరుకులతో పాటు రూ.5 వేలు సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు. మాలీ కులస్తులకు సంఘం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాలీ సంఘం యూత్ అధ్యక్షుడు మోర్లె పాండురంగ్, నాయకులు శంకర్, ధర్మయ్య, మధుకర్, పోచయ్య, సురేశ్, సుధాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.